



తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ





తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 118 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ గురువారం- 26 - మార్చి - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


### ఒకే దేశం, ఒకే చట్టం: గుజరాత్ లో

## యూనిఫాం సివిల్ కోడ్ !



- గుజరాత్ లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లు ప్రవేశపెట్టిన సీఎం భూపేంద్ర పటేల్
- "ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు జరిగాయి.

ఢిల్లి : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేసేందుకు గుజరాత్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు-2026ను గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీ యూసీసీ అమలుపై తుది నివేదికను సమర్పించిన వారం రోజుల తర్వాత ఈ బిల్లును అసెంబ్లీ ముందుకు తీసుకురావడం గమనార్హం.

### ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుపై

# మమత ఫైర్

## ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు!

- బీజేపీ, ఈసీ కుమ్మక్కు అయ్యాయి
- ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడంపై మమతా బెనర్జీ ఫైర్



ఢిల్లి : భారత ఎన్నికల సంఘం(ఈసీ), బీజేపీపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించడంపై మమతా బెనర్జీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల నిష్పాక్షికత, పారదర్శకతపై అనుమానాలు కలిగిస్తోందని అన్నారు. 'నిజమైన ఓటర్ల పేర్లు ఎన్నికల జాబితా నుంచి తొలగించారనే తీవ్ర సందేహాలు ఉన్నాయి. ఇది ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షిత, పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అదే సమయంలో గుర్తింపు, మిగతా..2లో

### వందేమాతరం' గీతానికి వ్యతిరేకంగా

## దాఖలైన పిటిషన్ ను కొట్టేసిన సుప్రీంకోర్టు

- వందేమాతరంై హోం మంత్రిత్వ శాఖ జారీ సర్క్యులర్ కు వ్యతిరేకంగా పిటిషన్
- దాన్ని కొట్టేసిన సర్వోన్నత న్యాయస్థానం



ఢిల్లి : దేశంలో నిర్వహించే అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్ కు వ్యతిరేకంగా దాఖలైన పటిషన్ ను విచారణ చేయడానికి సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం పాడడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయలేదని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ , న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పాంచోలీల త్రిసభ్య ధర్మాసనం ఈ పటిషన్ ను పరిశీలించింది. మహమ్మద్ సయీద్ నూరి దాఖలు చేసిన పిటిషన్ ప్రీమెచ్యూర్ గా, వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుందనే అనవసర ఆందోళన ఆధారంగా వేసినట్లు అభిప్రాయపడింది. పిటిషనర్ నూరి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, తాము దేశంలోని మిగతా..2లో

### ఆ పేరుతో ఇంకెన్నాళ్లు

## రాజకీయం చేస్తారు



- ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారా అని మండిపడ్డారు.
- రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమని బండి సంజయ్ ఆరోపించారు.

హైదరాబాద్: ప్రాంతీయ అసమానతల పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### క్యాన్లు, డబ్బాల్లో ఇంధనం నింపుకుంటే

# చర్యలు తీసుకుంటాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదన్న మంత్రి ఉత్తమ్
- వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం
- ప్రజలు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజీల్, వంట గ్యాస్ కొరత ఏర్పడుతోందనే ఆందోళనలపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌కు కొరత లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. మిగతా..2లో

### రేవంత్ రెడ్డికి దమ్ముంటే

## నాపై పోటీకి రావాలి

### హరీశ్ రావు సవాల్

- రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని,
- రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు.
- పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో మిగతా..2లో

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం... 3 వేల లక్ష్యాలపై దాడులు: ఇజ్రాయెల్



యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు.

ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు.

ఢిల్లి : యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్‌పై 15,000 బాంబులు వేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ, గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ బాంబులు వేశామని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి తమ సైన్యం 15 వేల బాంబులను ఇరాన్‌పై ప్రయోగించిందని కాట్జ్ వెల్లడించారు. మిగతా..2లో

## ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపుల బంద్



తెలంగాణలో చికెన్ వ్యాపారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

పౌల్ట్రీ కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేస్తున్నట్లు చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది.

హైదరాబాద్: పౌల్ట్రీ కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో చికెన్ వ్యాపారులు ఆందోళనకు దిగుతున్నారు. తక్కువ మార్జిన్ కారణంగా నష్టాలు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే మార్జిన్ సరిపోవడం లేదని వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా..2లో

### చంద్రబాబుకు భయపడొద్దు..

## ఆ రోజులు పోయాయి: జగన్



- పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు.
- గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు.
- రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని,

### 2029 నాటికి 50 వేల హోటల్ గదులు

## పర్యాటక శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

- పర్యాటక శాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- హాజరైన మంత్రి కందుల దుర్గేష్, పర్యాటకశాఖ ఉన్నతాధికారులు
- అమోదం తెలిపిన ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని దిశానిర్దేశం



మిగతాది 2లో

అమరావతి : రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో అమోదం తెలిపిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసారు. 2029 నాటికి 50 వేల హోటల్ గదుల నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. పర్యాటకులకు 10 వేల హోం స్టేలను కూడా అందుబాటులోకి తెచ్చేలా చూడాలని స్పష్టం చేసారు. విశాఖ, తిరుపతిలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. పర్యాటక శాఖపై సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కారావాన్ల రిజిస్ట్రేషన్లు, కారావాన్ పార్కుల ఏర్పాటు అంశంపైనా సీఎం సూచనలు చేసారు. అటవీ, దేవాదాయశాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని తెలిపారు. ప్రశాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధి ప్రాజెక్టులు 2026 మే నాటికి సిద్ధం చేయాలని

### రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు

# వదంతులు నమ్మొద్దు

## మంత్రి నాదెండ్ల మనోహర్

- 2.4 లక్షల గ్యాస్ బుకింగ్స్‌కు 5 లక్షల బుకింగ్స్
- సోషల్ మీడియాలో వదంతులు నమ్మొద్దని ప్రజలను కోరిన నాదెండ్ల
- పట్టణాల్లో పైప్డ్ గ్యాస్ సరఫరా పెంపుపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం



ఢిల్లి : పట్టణాల్లో ఎల్పీజీ సిలిండర్ల నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ సిలిండర్ల వైపు వినియోగదారులను మళ్లించేలా కొత్త పాలసీని తీసుకొస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ విషయమై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. వన్ టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరగాలని, సిలిండర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదన్న మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రజలు వదంతులు నమ్మి ముందుజాగ్రత్తగా గ్యాస్ బుక్ చేస్తున్నారని తెలిపారు. 2.4 లక్షల గ్యాస్ బుకింగ్స్‌కు

మొదటి పేజీ తరువాయి

## 2029 నాటికి 50 వేల హోటల్ గదులు
## పర్యాటక శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

తెలిపారు. ఈ 2 పథకాల కింద మరో రూ. 663 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటకశాఖ అధికారులు వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదావరి పుష్కరఘాట్‌తో పాటు హేవ్ లాక్ బ్రిడ్జిపై పర్యాటకులను అనుమతించే పనులు ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి కందుల దుర్గేష్, టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఆ శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

## చంద్రబాబుకు భయపడొద్దు..
## ఆ రోజులు పోయాయి: జగన్

అమరావతి: వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపుల బంద్

దీంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. చికెన్ ధరలు పెరిగినా, మధ్యవర్తుల విధానాల వల్ల తాము లాభపడడం లేదని వ్యాపారులు అంటున్నారు. తమ సమస్యలను పౌల్ట్రీ కంపెనీలకు పలుమార్లు తెలియజేసినా, సరైన స్పందన రాలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా చికెన్ షాపులను మూసివేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రారంభమవుతుందని ప్రకటించారు. చికెన్ షాపుల బంద్ వల్ల వినియోగదారులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు కోరుతున్నారు.

## ఇరాన్‌పై 15,000 బాంబులు వేశాం...
## 3 వేల లక్ష్యాలపై దాడులు: ఇజ్రాయెల్

గత ఏడాది జూన్‌లో 12 రోజుల పాటు జరిగిన సంఘర్షణ సమయంలో కంటే నాలుగురెట్లు బాంబులు ఉపయోగించినట్లు తెలిపారు. ఇరాన్‌లోని 3,000 లక్ష్యాలపై దాడులు చేసినట్లు తెలిపారు. అయితే ఇరాన్‌పై దాడిని ఐదు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ చెబుతోంది.

## రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి

తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు. ఆయన వస్తారా లేదా అనేది ఇప్పుడే చెప్పడం కంటే, వేచి చూస్తేనే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

## ఆ పేరుతో ఇంకెన్నాళ్లు
## రాజకీయం చేస్తారు: బండి సంజయ్

ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారా అని మండిపడ్డారు. దేశభక్తి, జాతీయవాదం మీలో మచ్చుకైనా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైనట్లుగా ఉందని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పారడం లేదని ఎద్దేవా చేశారు. అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కాంగ్రెస్ వారు కొత్త డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే దేశాన్ని సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు.

## రెండు చోట్లా పుతిన్‌కే లాభం

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అయిదో సంవత్సరంలోకి అడుగు పెట్టింది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో మొదలైన గల్ఫ్ యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా గుబులు రేపుతోంది. ఈ రెండు యుద్ధాల్లో గెలుపోటముల పరిస్థితి ఎలా ఉన్నా, లాభం మాత్రం రష్యా అధ్యక్షుడు పుతిన్ పొందుతున్నారు. స్వదేశంలో ప్రజల మద్దతు పెరిగి మరింత బలమైన నేతగా ఆయన అవతరిస్తున్నారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్య చేపట్టినప్పటి నుంచి ఇంతవరకూ రష్యా తన వైమానిక సేనను, ఇతరత్రా అత్యాధునిక ఆయుధాలను పూర్తిస్థాయిలో ప్రయోగించలేదు. అయినా దీన్ని 'పూర్తిస్థాయి యుద్ధం'గా పాశ్చాత్య మీడియా ప్రచారం చేస్తోంది. దానికి ఇతర దేశాలూ వంతపాడుతున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం ద్వారా ఐరోపాలో సగభాగాన్ని తన అధీనంలోకి తెచ్చుకోవడమే రష్యా లక్ష్యమనేది పాశ్చాత్య మీడియా ప్రచారం. కానీ, తన సరిహద్దులదాకా విస్తరించకుండా నాటోను అడ్డుకోవడానికే రష్యా పరిమితమైందని గుర్తించాలి. ఉక్రెయిన్‌ను తమలో చేర్చుకోవడం ద్వారా రష్యా సరిహద్దుల వరకు చొచ్చుకురావాలనీ, మాస్కోను ఏకాకిని చేసి చక్రబంధంలో ఇరికించాలని అమెరికా–నాటో కూటమి పన్నాగం పన్నిందని గమనించిన పుతిన్, దాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సాగనివ్వరాదని భీష్మించారు. అందుకే రష్యా ప్రజలు కూడా ఉక్రెయిన్‌తో పోరు వాస్తవానికి నాటోతో పరోక్ష యుద్ధమని గ్రహించారు. ఉక్రెయిన్‌పై సైనిక చర్య విషయంలో పుతిన్ ఎలాంటి తప్పూ చేయలేదని రష్యా ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ఈ యుద్ధం తమకు అనుకూలంగా త్వరలోనే ముగుస్తుందనే విశ్వాసంతో వారున్నారు. యుద్ధానికి ముందు రష్యాలో పాశ్చాత్య దేశాల పట్ల మెతక వైఖరి అవలంబించే ఉదారవాద వర్గం ఒకటి ఉండేది. ఉక్రెయిన్‌కు అమెరికా, ఐరోపా దేశాలు ఆయుధ, ఆర్థిక సాయం అందించడంతో రష్యాలోని ఉదారవాదులకు మద్దతు పోయింది. పుతిన్ అనుచరగణాల్లో నాటో పట్ల దుందుడుకు వైఖరి అవలంబించాలని వాదించే వర్గం ఇప్పుడు బలపడింది. మరోవైపు, పాశ్చాత్య దేశాల్లోని యుద్ధ అనుకూల వర్గాలైన సైన్యం, ఆయుధ పరిశ్రమల లాబీకి ఈ పోరు డబ్బును, ప్రాబల్యాన్నీ తెచ్చిపెడుతోంది.

మారిన రష్యా వ్యూహం

నిజానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మొదట్లో రష్యాతో సయోధ్య కుదుర్చుకోవాలని అనుకున్నారు. కానీ, దీన్ని ఆ దేశంలోని అతివాద వర్గం వ్యతిరేకించింది. 2020లో అజర్ బైజాన్ తమ అండతో ఆర్మీనియాను ఓడించినట్లే, ఉక్రెయిన్ కూడా రష్యాను ఓడించగలదనీ, అందుకు తమ అండదండలు పూర్తిగా ఉంటాయని అమెరికా, నాటోలు నచ్చజెప్పాయి. దాంతో 2021 జనవరిలో జెలెన్‌స్కీ తన రష్యా విధానాన్ని మార్చుకుని, నాటో సభ్యత్వం కోసం పట్టుబట్టడం ప్రారంభించారు. ఫలితంగా పుతిన్ 2021 మార్చిలో ఉక్రెయిన్ సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించారు. జార్జియా యుద్ధం తరహాలోనే ఉక్రెయిన్‌ను కూడా బలప్రదర్శనతో లొంగదీసుకోవచ్చని పుతిన్ తొలుత భావించారు. కానీ, ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాల భారీ సైనిక సాయం వల్ల యుద్ధం సుదీర్ఘంగా సాగింది. యుద్ధం ముగింపునకు 2022లో ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. బ్రిటన్, అమెరికాల కుతంత్రమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో రష్యన్లు చర్చలకు స్వస్తిచెప్పి వ్యూహాన్ని మార్చుకున్నారు. ఉక్రెయిన్‌లో తమ అదుపులోకి తీసుకోవడం కష్టమని భావిస్తున్న ప్రాంతాలను వదిలివేసి, డాన్‌బాస్ వెంబడి సుదీర్ఘ యుద్ధానికి సిద్ధమయ్యారు. అలాగే, తాము పాక్షికంగా ఆక్రమించిన నాలుగు ప్రాంతాలను అధికారికంగా విలీనం చేసుకోవడం ద్వారా ఉక్రెయిన్ మొండితనానికి భారీ మూల్యం చెల్లించేలా చేశారు. పాశ్చాత్య దేశాల సైనిక–పారిశ్రామిక వ్యవస్థ స్వలాభం కోసం ఉక్రెయిన్‌ను తమపై పావుగా వాడుకుంటోందని రష్యన్లు భావిస్తున్నారు. ఈ యుద్ధం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని పాశ్చాత్య నిపుణులు జోస్యం చెప్పారు. కానీ, 2025లో రూబుల్ ప్రపంచంలోనే అత్యుత్తమ పనితీరు కనబరచిన కరెన్సీగా నిలిచింది. రష్యా సైన్యం డ్రోన్ యుద్ధతంత్రంలో ఆధిక్యత సాధించి, యుద్ధాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఉక్రెయిన్ జనాభా పరంగా, ఆర్థికంగా చితికిపోగా, రష్యా సమాజం మాత్రం యుద్ధానికి ముందున్న జీవనశైలినే కొనసాగిస్తోంది.

# రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు - వదంతులు నమ్మొద్దు:
# మంత్రి నాదెండ్ల మనోహర్

మొదటి పేజీ తరువాయి

5 లక్షల బుకింగ్స్ అవుతున్నాయని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. పైప్డ్ గ్యాస్ కనెక్టివిటీ: వాణిజ్య అవసరాలకు ఇచ్చే గ్యాస్ సరఫరాను కేంద్రం 10 నుంచి 20 శాతం పెంచిందని మంత్రి వెల్లడించారు. వాణిజ్య సిలిండర్లు వాడేవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెస్టారెంట్లు, విద్యాసంస్థలకు సరఫరా పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని ప్రజలు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 2.34 లక్షల మంది పైప్డ్ గ్యాస్ వినియోగించుకుంటున్నారన్న మంత్రి, పట్టణ ప్రాంతాలకు దీని కనెక్టివిటీ అందుబాటులో ఉందని పునరుద్ఘాటించారు. పట్టణాల్లో పైప్డ్ గ్యాస్ ఇంటింటికీ తరలింపునకు మరిన్ని పైపులు వేయాల్సి ఉందన్నారు. సోలార్, ఇండక్షన్ కుకింగ్ స్టౌవ్‌లను వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో



ఎక్కడా పెట్రోల్ , డీజిల్ కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు 'సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ నివారణకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే సిలిండర్ల అక్రమాలపై 800 కేసులు నమోదయ్యాయి. 3,540 సిలిండర్లు సీజ్ చేశాం. అధిక ధరలకు విక్రయం, బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు. కచ్చితంగా వన్‌టైమ్ పాస్‌వర్డ్ ద్వారానే గ్యాస్ సరఫరా జరపాలి. ఎవరైనా అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే రాష్ట్ర స్థాయి టోల్‌ఫ్రీ నెం.1967 లేదా జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చు.' –నాదెండ్ల మనోహర్, మంత్రి డీలిమిటేషన్ పై సమగ్ర అధ్యయనం: జనాభా ప్రాతిపదికనే డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందన్న మంత్రి దీనిపై త్వరలో పార్టీలో సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కమిటీ ముందు ఉంచాల్సిన అంశాలను తమ పార్టీ తరపున చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నష్టం ఉందా లేదా అనే అంశంపై అధ్యయనం చేశాకే అభిప్రాయాలు తెలుపుతామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. ప్రజలకు ఎక్కువ సేవ చేయాలంటే నియోజకవర్గాల పునర్విభజన అవసరమని మంత్రి నాదెండ్ల అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపుపై మమత ఫైర్

మొదటి పేజీ తరువాయి

పౌరసత్వంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఎవరు భారతీయ ఓటరుగా గుర్తింపు పొందుతున్నారు? వారిని ఏ ప్రమాణాల ఆధారంగా గుర్తిస్తున్నారు? ఈ అంశంపై బీజేపీ స్పందించాల్సిన అవసరం ఉంది. అలాగే కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ క్యాంపులు ఏర్పాటు చేయాలని చూస్తోంది. నేను ఎప్పటికీ దాన్ని అనుమతించను. నా తర్వాత వచ్చే వారు కూడా అనుమతించరు' అని మమతా బెనర్జీ పేర్కొన్నారు.

అనుబంధ ఓటర్ల జాబితాలపై సందేహాలు

అంతకుముందు కూడా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్ ) ప్రక్రియపై కూడా మమతా బెనర్జీ విమర్శలు చేశారు. ఈసీ, బీజేపీలు కలిసి ప్రజల ఓటు హక్కులను తొలగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈసీ అధికారిక పత్రంపై బీజేపీ గుర్తు కనిపిస్తోందని అన్నారు. ఇది కేవలం కేరళకే కాకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. దీనిని మానవతప్పిదం అని చెప్పి తప్పించుకోలేరని అన్నారు. అదనంగా, అనుబంధ ఓటర్ల జాబితాలు బ్లాక్, జిల్లా స్థాయిలో అందుబాటులో లేవని మమతా బెనర్జీ ఆరోపించారు. ఎస్ ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన మరణాల సంఖ్య 200 దాటిందని పేర్కొన్నారు. ఇప్పుడు నిజం బయటపడిందని, జాబితాలు రాత్రివేళ ప్రచురించడం ఎందుకు? అని ప్రశ్నించారు. ఇంకా బ్లాక్, జిల్లా స్థాయిలో జాబితాలు ఉంచలేదని తెలిపారు. ప్రజలకు తమ ఓటు స్థితి తెలియడం లేదని అన్నారు. తాజాగా ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

సుప్రీంకోర్టు జోక్యంతో జాబితాలో పేర్లు- కానీ పారదర్శకత లోపం

సుప్రీంకోర్టు జోక్యం తర్వాత కొంతమంది పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చినప్పటికీ, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా లేదని మమతా బెనర్జీ విమర్శించారు. తాము సుప్రీం కోర్టులో వేసిన కేసు వల్లే కొన్ని పేర్లు జాబితాలో చేర్చినట్లు చెప్పారు. అయితే పూర్తి జాబితాను స్పష్టంగా ప్రకటించడంపై ఈసీ ఎందుకు వెనకడుగు వేస్తోందని అని ప్రశ్నించారు. జాబితాను ప్రచురించడానికి ఈసీకి 6-7 రోజులు ఎందుకు పట్టింది? ఆ సమయంలో ఒక ప్రత్యేక పార్టీకి చెందిన ఓటర్లను చేర్చారా? పూర్తి జాబితా వెలువడితేనే నిజాలు బయటపడతాయని అన్నారు.ఎన్నికల ముందు ఐక్యతకు పిలుపు

త్వరలో బంగాల్ అసెంబ్లీ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో, ఒక పార్టీ (బీజేపీ) ఆధిపత్యంకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా నిలవాలని మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, న్యాయంగా కొనసాగేందుకు ఈ ఐక్యత అవసరమని ఆమె స్పష్టం చేశారు. బంగాల్ అసెంబ్లీలో 294 స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇక ఇటీవల ఎస్ ఐఆర్ ప్రక్రియ తర్వాత బంగాల్ లో తొలి సప్లిమెంటరీ

# క్యాన్లు, డబ్బాల్లో ఇంధనం నింపుకుంటే చర్యలు తీసుకుంటాం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ లో మంగళవారం కొన్ని బంకులు పెట్రోల్ లేక మూసివేయడంతో జనం ఆందోళనకు గురయ్యారు. దీంతో సాయంత్రం నుంచి బంకుల ముందు క్యూ కట్టారు. ఉదయం నుంచి ఇదే పరిస్థితి కనిపించడం, దీనికి తోడు పలు బంకులు మూతపడటంతో ఉత్తమ్ స్పందించారు. 60 రోజులకు సరిపడా పెట్రోలు నిల్వలు ఉన్నాయి : తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈరోజు డిమాండ్ 17,246 కిలోలీటర్లు కాగా, 17,898 కిలోలీటర్లు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం కారణంగా డిమాండ్ 25 శాతం పెరిగినప్పటికీ, సరఫరా సగటుకు మించి 22 శాతం అధికంగా కొనసాగుతోందని, అదనంగా 16,000 కిలోలీటర్ల బఫర్ స్టాక్ సిద్ధం చేశామని, 1,200 అదనపు ట్యాంకర్లను రంగంలోకి దించామని పేర్కొన్నారు. ఏ బంకునూ మూసివేయడానికి అనుమతించం : కొన్ని



పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపించడం ట్యాంకర్లు ఇంకా చేరుకోనందువల్లేనని, నిజమైన కొరత కారణంగా కాదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చాలాచోట్ల ప్రజలు భయంతో ముందు జాగ్రత్త కోసమని క్యాన్లు, కంటెయినర్లలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడంపై మంత్రి స్పందించారు. ఇలా క్యాన్లలో తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేసినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిధిలో 596 పెట్రోల్ బంకులు పూర్తిగా నిర్వహిస్తున్నాయని, ఏ బంకునూ మూసివేయడానికి అనుమతించమని ఆయన స్పష్టం చేశారు. వదంతులు పూర్తిగా అవాస్తవం : డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లు కూడా పుష్కలంగా ఉన్నాయని, కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కేంద్రంతో మాట్లాడుతున్నామని ఉత్తమ్ తెలిపారు. చట్టవిరుద్ధంగా నింపిన 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని గుర్తు చేశారు. స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వులు 60 నుండి 65 రోజులకు సరిపడా ఉన్నాయని, ఓఎన్జీసీ అంతరాయం లేకుండా సరఫరా కొనసాగేలా చూస్తోందని తెలిపారు. కొరత గురించి వస్తున్న అన్ని వదంతులు పూర్తిగా అవాస్తవం అని, అలాంటి ప్రచారాలు విని ప్రజలు ఆందోళన చెందవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పుకార్లు సృష్టించే ఊరుకోం : మరోవైపు హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే పుకార్లు నమ్మొద్దని సీపీ సజ్జనార్ కోరారు. పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 60 రోజులకు సరిపడా పెట్రోలు నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఎవరు కూడా అపోహలు నమ్మవద్దని, సోషల్ మీడియా వార్తలపై నిఘా పెట్టామని తెలిపారు.

# రాజకీయాలను పక్కనపెట్టి.. భట్టి విక్రమార్కతో కేటీఆర్ భేటీ

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ తీసుకున్నారు. ఈరోజు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఆయన, సిరిసిల్ల నియోజకవర్గంలోని పవర్ లూమ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ భేటీ అందరినీ ఆకట్టుకుంటోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న సుమారు రూ. 38 కోట్ల విద్యుత్ బకాయిలు, పేరుకుపోయిన బ్యాక్ బిల్లింగ్, సర్‌ఛార్జ్‌లను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగానే పరిశ్రమకు నిరంతర విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. పరిశ్రమ సంక్షోభంలో ఉండటంతో నేతన్నలు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని, వారికి తక్షణమే భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం



ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యుత్ బకాయిల అంశాన్ని లోతుగా పరిశీలించి కార్మికులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# వందేమాతరం' గీతానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ ను కొట్టేసిన సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

అన్ని మతాలను గౌరవిస్తామని అన్నారు. కానీ మతం, విశ్వాసంతో సంబంధం లేకుండా ప్రజలందరూ జాతీయ గేయం పాడాలని బలవంతం చేయకూడదని పేర్కొన్నారు. ఒక వేళ అలా బలవంతం చేస్తే అది దేశంపై విశ్వాసం చూపించాలని బలవంతం చేసినట్లు అవుతుందని అన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ బాగ్చీ, జాతీయ గేయం పాడనందుకు ఎవరికైనా శిక్ష పడిందా? లేదా వందేమాతరం పాడనందుకు ఎవరినైనా అధికారిక సభల నుంచి బయటకు పంపేశారా? కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్ లో అలాంటి అంశాలు ఏమైనా ఉన్నాయా? అని పిటిషనర్ ను ప్రశ్నించారు.దీనికి 'వందేమాతరం గేయం పాడినప్పుడు అంతరాయం కలిగిస్తే జరిమానా ఉంటుంది' అని హెగ్డే పేర్కొన్నారు. నిజానికి పాడనివారిపై లీగల్ గా ఎలాంటి చర్యలు తీసుకోనప్పటికీ, జరిమానాలు వేయడం వల్ల, పాడడానికి, లేదా నిలబడడానికి నిరాకరించే వారిపై ఎప్పుడూ ఆర్థిక భారం పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఇలా ప్రజలను జాతీయ గేయం పాడమని బలవంతం చేయవచ్చా? అని ఆయన తిరిగి ప్రశ్నించారు.దీనితో హెగ్డేను ఉద్దేశించి,' జాతీయ గేయం పాడమని బలవంతం చేస్తూ పిటిషనర్ కు ఎవరైనా నోటీసు పంపారా?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశంలోని 5వ నిబంధన 'మే' (మెుఎ) అని చెబుతోంది. అంటే జాతీయ గేయమైన వందేమాతరాన్ని పాడడం లేదా పాడకపోవడం అనే విషయంలో అందరికీ స్వేచ్ఛ ఉంది. కనుక ఇది చట్టపరమైన హక్కులకు విరుద్ధం కాదు" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. అయితే పిటిషనర్ కు ఏదైనా నోటీసు లేదా శిక్ష పడే పరిస్థితి ఎదురైనప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని ధర్మాసనం పేర్కొంది.



ప్రస్తుతానికి పిటిషనర్ మహమ్మద్ సయీద్ నూరి వివక్షకు గురవుతామనే అనవసరపు ఆందోళనతో వేసిన పిటిషన్ తప్ప మరేమీ కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### వందేమాతరం ఆలపించాకే జనగణమన

జాతీయ గేయం వందేమాతరం ఆలాపనపై కేంద్ర హోంశాఖ జనవరి 28న కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. జాతీయ గేయం వందేమాతరం, జాతీయ గీతం జనగణమన రెండింటినీ ఆలపించే చోట తొలుత వందేమాతరం 6 చరణాలను ఆలపించాలని హోంశాఖ నిర్దేశించింది. అధికారిక కార్యక్రమాలు, వేడుకల్లో తొలుత 3 నిమిషాల 10 సెకన్ల పాటు వందేమాతర గేయంలోని 6 చరణాలను ఆలపించాలని సూచించింది. రాష్ట్రపతి కార్యక్రమం, జాతీయ పతాకం ఆవిష్కరణ కార్యక్రమాలు, గవర్నర్ల ప్రసంగాలు వంటి సందర్భాల్లోనూ ఈ ప్రొటోకాల్‌ను పాటించాలని కేంద్ర హోంశాఖ తెలిపింది. జాతీయ గేయం వందేమాతరం ఆలాపన జరిగే చోట తప్పకుండా అందరూ నిలబడాలని నిర్దేశించింది. న్యూస్ రీల్, డాక్యుమెంటరీ, సినిమాలలో వందేమాతరం ఆలాపన జరిగినప్పుడు ప్రేక్షకులు నిలబడడంపై మినహాయింపు ఇచ్చింది. ఇక స్కూళ్ల కార్యకలాపాలు తప్పకుండా వందేమాతరం ఆలాపనతోనే మొదలుకావాలని తెలిపింది. అయితే దేశ గౌరవానికి చిహ్నాలైన జాతీయ గీతం, గేయం ఆలాపన జరుగుతున్నప్పుడు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించినా లేదా అగౌరవపరిచినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేసింది. అంతేకాదు అలాంటి వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని పేర్కొంది.

## ఏదుల గ్రామపంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో సిసి రోడ్ ప్రారంభం

### నీళ్ల ట్యాంక్ దగ్గర సీసీ రోడ్డు మరమాత్



ఏదుల మండలం మార్చి 25( వార్త నిర్భయం)

ఏదుల మండల కేంద్రంలో. వనపర్తి శాసనసభ్యులు.తూడి మేఘారెడ్డి కృషి మేరకు, ఏదుల మండల కాంగ్రెస్ నాయకులు పందెం.సుఖేందర్ రెడ్డి ఏదుల గ్రామ సర్పంచ్.పరశురామ్ యాదవ్ మరియు గ్రామ పంచాయతీ పాలక మండలి.ఆధ్వర్యంలో ఈరోజు నీళ్ల.ట్యాంక్.దగ్గర సిసి రోడువేయడం.జరిగింది. ఈ కార్యక్రమంలో ఏదుల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్. గ్రామ ఉపసర్పంచ్ ఉల్పాల శేశిరెడ్డి. గోపాల్పేట్ మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు జానకిరామ్ యాదవ్.6 వ వార్డు సభ్యులు ఏ కాశమ్మ సైదులు. 11వ వార్డు మెంబర్ రాముడు యాదవ్. 12వ వార్డు మెంబర్ మల్లయ్య యాదవ్.బొల్లె కృష్ణయ్య.మాజీ వార్డు మెంబెర్ హుస్సేన్.హనుమంతు మరియు బీచుపల్లి, దూరల రాముడు, కావాలి శ్రీను తదితరులు పాల్గొనడం జరిగింది

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి కలిసిన గ్రామ సర్పంచ్ పగడాల రవి



ఏదుల మండలం మార్చి 25 (వార్త నిర్భయం)

వనపర్తి ఆదర్శ్ సురభి జిల్లా కలెక్టర్ని కలిసిన ఏదుల మండలం.చీర్కపల్లి గ్రామ సర్పంచ్ పగడాల రవి, ఉపసర్పంచ్, పరుశురాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జమ్మి మల్లేష్ వార్డ్ సభ్యులు దొడ్ల కాశీమ్,కలవడం జరిగింది. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి గురించి జరగబోయే అభివృద్ధి గురించి జిల్లా కలెక్టర్.తో మాట్లాడటం జరిగింది.మా గ్రామం పై ప్రత్యేక శ్రద్ధ వహించి, నిధులు మంజూరు చేయగలరని కోరడమైనది.

## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.

### మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..



మల్కాజ్గిరి మార్చి 25 (వార్త నిర్భయం) పేదల ఆరోగ్యం మెరుగుపరచడానికి బస్తీ దవాఖానాలు అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇటీవల ఎమ్మెల్యే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం సమర్పించారు స్పందించిన కలెక్టర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ లావణ్య కు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ టాప్ కాలనీలో పేదల కోసం నిర్మించిన బస్తి దవాఖాన భవనాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ తో కలిసి పరిశీలించడం జరిగింది. త్వరలో బస్తీ దావకాలను అందుబాటులోకి తీసుకొచ్చి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడతామని డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు బైరుఅనిల్, మర్రి శ్రీనివాస్, వెంకటేష్, అశోక్ మరియు హిల్ టాప్ కాలనీ బస్తివాసులు పాల్గొన్నారు


## సీఎం రిలీఫ్ ఫండ్ తో పేదలకు ఖరీదైన వైద్యం



సూర్యాపేట బ్యూరో మార్చి 25 వార్త నిర్భయం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద ప్రజలకు ఖరీదైన వైద్యం అందుతుంది అని తెలంగాణ రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం వారి నివాసంలో 24 మంది లబ్ధిదారులకు 9,26,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 నెలలో మా తరఫున 98 మంది లబ్ధిదారులకు దాదాపు 40,25,500 రూపాయలు అందించామని తెలిపారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ పేరు మీద 1000 కోట్లకు పైగా నిధులను మంజూరు చేశారని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేద ప్రజలకు ఒక వరం లాగా మారిందన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అర్హులకు అందిస్తామన్నారు. మాకు సహకరిస్తున్న ఎంపీ రఘువీర్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్ కొనతం రాజేష్ రెడ్డి, జ్యోతి కరుణాకర్, వల్దాస్ దేవేందర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు అండగా పరమేశ్వర్‌రెడ్డి..

### ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా వ్యాపారాలు చేసుకునేలా అవకాశం





ఉప్పల్ మార్చి 25 (వార్త నిర్భయం) ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపిన నాయకుడు ఉప్పల్ ప్రాంతంలో వీధి వ్యాపారులకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అండగా నిలిచారు. వీధి వ్యాపారులు రోడ్డున పడకుండా ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసి యథావిధిగా వ్యాపారం చేసుకునేలా అవకాశం కల్పించారు. ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉప్పల్ రింగురోడ్డులో ఉన్న వరంగల్ బస్టాప్‌ను ఉప్పల్ నల్లచెరువు ప్రాంతానికి తరలించనున్నారు. దీంతో నల్ల చెరువు ప్రాంతంలో ఉన్న వీధి వ్యాపారులను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఆదేశించారు.వీధి వ్యాపారులు ఇదే విషయాన్ని పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఏళ్ల తరబడి ఇక్కడనే చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నట్టుగా వాపోయారు. దీంతో పరమేశ్వర్‌రెడ్డి బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ గారు,ఇన్‌స్పెక్టర్‌లు రామలింగ రెడ్డి ,నాగరాజు తో మాట్లాడారు. వారితో కలిసి నల్లచెరువు వద్ద వీధి వ్యాపారాలు చేసే స్థలాన్ని అధికారులతో కలిసి పరమేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ట్రాఫిక్ అధికారుల సూచన మేరకు అదే ప్రాంతంలో ట్రాఫిక్ కు ఆటంకం లేకుండా వ్యాపారాలు చేసుకునేలా స్థలాన్ని చూపించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో విధి వ్యాపారులు పాల్గొన్నారు

## వనపర్తి రానున్న,రాష్ట్ర ప్రజా సంఘాలు నేతలు త్వరలో ఐక్యవేదిక

### చిర్కపల్లి గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక కమిటీ





ఏదుల మండలం మార్చి 25( వార్త నిర్భయం )

వనపర్తి రానున్న రాష్ట్ర ప్రజా సంఘాల నేతలు.త్వరలో ఏదుల మండల కేంద్రంలో జరుగుతున్న చీర్కపల్లి గొల్లపల్లి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశానికి రానున్న పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్ విమలక్క హైదరాబాదు సోమాజిగూడ ప్రెస్ క్లబ్బులో రాష్ట్ర ప్రజా సంఘాల నేతలు పృథ్వీరాజు యాదవ్, తెలంగాణ విఠల్, విమలక్కలను కలిసి వనపర్తి జిల్లా సమస్యలపై చర్చించి వినతి పత్రంసమర్పించిన అఖిలపక్ష ఐక్యవేదిక. మరియు గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరే కమిటీ.డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ, నాకు ఉన్న పరిచయంతో డాక్టర్ పృథ్వీరాజ్ అన్నకు ఫోన్ చేసి సమస్యలు వివరించడంతో వెంటనే స్పందించి సోమాజిగూడ ప్రెస్ క్లబ్ రండి విఠల్ మరియు. విమలక్క కూడా.వస్తుంది.మాట్లాడదాం అనిచెప్పడంతో. గొల్లపల్లి బిచీర్కపల్లి అఖిలపక్ష కమిటీని వెంట వేసుకుని. అక్కడికి వెళ్లి పృథ్వీరాజ్, విట్టల్, విమలక్కల ను కలిసి.వనపర్తి లో జరుగుతున్న సమస్యలను, మరియు ఏదులమండలంలో గొల్లపల్లి చీరకపల్లి రిజర్వాయర్ గురించి.వివరించడంతోపాటు వనపర్తికి రమ్మని ఆహ్వానించడం జరిగింది. వెంటనే స్పందించిన ముగ్గురు నేతలు త్వరలో వీలుచూసుకొని వనపర్తికి వస్తామని అలాగే గొల్లపల్లి కి కూడా వస్తామని, వారి ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది.త్వరలో జరిగే అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా సతీష్ యాదవ్ నిర్వహించబోయే రౌండ్ టేబుల్ సమావేశానికి రమ్మని చెప్పడం జరిగింది. వారు వస్తామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా.సతీష్ యాదవ్, బి ఎస్ పి ఎమ్మెల్యే కాంటెస్టెంట్ అభ్యర్థి మై బూస్, మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్ నాయక్, గోపాల్ రావు,దొడ్ల రాములు,మద్దం రమేష్, సునిల్ కుమార్, మహమూద్, జమ్మి శేషయ్య,తలారి కుర్మయ్య, బొగ్గు వెంకటేష్, బోయ రాములు, జూపల్లి కుమార్ రావు, దౌద రాజు దానయ్య, జూపల్లి భాస్కర్ రావు,గనేష్ బొగ్గు సలేశ్వరం జెట్టి రాములు, రామ చంద్రయ్య, మహేష్. బాలస్వామి పాల్గొన్నారు.

## యుద్ధ ప్రభావం,బిజెపి వైఫల్యంతో ప్రజల బ్రతుకులు అస్తవ్యస్తం

**కా,, తోట జీవన్న,**

**గుమ్మలక్ష్మిపురం సంతలో సిపిఐ ఎమ్ ఎల్ రెడ్ స్టార్ ఆధ్వర్యంలో ప్రచారం**

**సిపిఐ (ఎమ్ ఎల్) రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట జీవన్న.**



పార్వతీపురం మార్చి 25 (వార్త నిర్భయం) బీజేపీ ప్రభుత్వ విధాన వైఫల్యశీతో దేశ ప్రజల బ్రతుకులు అస్తవ్యస్తశీ అవుతున్నాయని సిపిఐ (ఎమ్ ఎల్) రెడ్ స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట జీవన్న అన్నారు, కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ గుమ్మలక్ష్మిపురం సంతలో పార్టీజిల్లా కార్యవర్గ సభ్యులు బిడ్డిక రమణ మూర్తి, పాడి చిరంజీవి, గరుగుబిల్లి సూరయ్య ఆధ్వర్యంలో ప్రచారశీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ,,దేశవ్యాప్తంగా పెరిగిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధరలు, తగ్గిన గ్యాస్ సరఫరాతో ప్రజలు సతమతవుతున్నారు. ఇందుకు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం మరియు కేంద్రంలో మోదీ సర్కార్ విధాన వైఫల్యాలే కారణం.ఇరాన్ నాయకత్వాన్ని మార్చాలని కుటిల నీతితో అమెరికా ఇజ్రాయిల్ ఆ దేశంపై ఫిబ్రవరి 28న ఏకపక్షంగా బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ తనపై జరిగిన దాడుల ప్రతిస్పందనగా యుఎఇ, బహ్రెయిన్, దుబాయ్, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలలోని అమెరికా రాయబార కార్యాలయాలు, చమురు క్షేత్రాలపై డ్రోన్ దాడులు చేస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా రెండవసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రపంచానికి తనకు తాను రారాజుగా భావిస్తున్నాడు అరుదైన ఖనిజాలు కలిగిన గ్రీన్ ల్యాండ్‌ను తమ దేశంలో కలిసి పోవాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచంలో అత్యధిక చమురు నిక్షేపాలు కలిగిన దేశం వెనిజులా. ఆ దేశంలో చమురుపై కన్నేసిన ట్రంప్ వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన సతీమణితో పాటు ఏకంగా అర్ధరాత్రి అపహరించి అమెరికాకు తరలించుకుపోయాడు. ఇప్పుడు ఇరాన్‌లో తనకు అనుకూల ప్రభుత్వం రావాలని, అక్కడి పెట్రోల్ నిక్షేపాలపై నియంత్రణ సాధించాలని యుద్ధం చేస్తున్నాడు ట్రంప్. పశ్చిమాసియా ప్రాంతంలో ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్ ట్రంప్‌ను యుద్దానికి ఒప్పించింది. అంతర్జాతీయ న్యాయస్థానం యుద్ధనేరం కింద అరెస్టు వారెంటు జారీ చేయబడిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ రక్తదాహానికి అంతులేకుండా పోయింది. ఒకవైపు తమ దేశాన్ని విస్తరించేందుకు పాలస్తీనాను, మరో వైపు పొరుగున్న ఉన్న లెబనాన్ వంటి దేశాలను ఆక్రమించుకుంటూ పోతున్నారు. అటు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం, ఇటు గల్ఫ్ దేశాలలో చమురు క్షేత్రాలపై దాడి, కీలకమైనో ఆర్మూజ్ జలసంధి నుంచి చమురు ఎగుమతి నౌకలను వెళ్లనీయకుండా ఇరాన్ అడ్డుకోవడం వంటి చర్యలతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత తీవ్రమైంది. బ్యారెల్ ధర రూ.100 దాటింది. ఫలితంగా భారతదేశంలో గృహ అవసరాల గ్యాస్ ధరలు రూ.60కి పెరిగాయి. మన దేశంలో పెట్రోల్, గ్యాస్ ధరలకు కొరత లేదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలు అబద్ధమని బైట పరిస్థితి చూస్తే తేలిపోతోంది. గ్యాస్ సరఫరా తగ్గిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హోటల్లు మూతపడుతున్నాయి. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోవడమే కారణం. గతంలో మనకు రష్యా నుంచి సబ్సిడీ ధరకు చౌకగా లభిస్తున్న చమురును అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం కేంద్ర ప్రభుత్వం వదులుకుంది. రష్యా మాదిరిగానే డాలర్లు కాకుండా ఇరు దేశాల కరెన్సీతో మనకు చమురును అమ్ముతున్న ఇరాన్‌ను సైతం అమెరికా, ఇజ్రాయెల్ ఒత్తిడితో వదులుకున్నాం. ఇరాన్‌పై యుద్ధం విషయంలో కూడా ఆ దేశాలకే పరోక్ష మద్దతు పలుకుతోంది మోదీ సర్కార్. ఫలితంగా గల్ఫ్ నుంచి చమురు, గ్యాస్ రావడానికి ఇబ్బందులు పడుతున్నాం. ఇది పూర్తిగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఫల్యమే కారణం. నెల రోజుల పాటు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు అనుమతిస్తున్నామంటూ అమెరికా ప్రకటించి భారతదేశ సార్వభౌమాధికారాన్ని అవమానించింది. గతంలో అలీనోద్యమానికి రూపకర్తలమై ప్రపంచ వర్ధమాన దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారతదేశ విదేశాంగ విధానం ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో నడిచే దుస్థితి ఏర్పడడం అత్యంత విచారకరం. అటు సామ్రాజ్యవాదకాంక్ష, పెట్రోలుపై ఆధిపత్యం కోసం డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా అంతర్జాతీయ చట్టాలను, దేశాల సార్వభౌమాధి కారాలను ,ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోంది. ఐక్యరాజ్య సమితిని నిర్వీర్యం చేసింది. అడ్డగోలుగా ఇతర దేశాలపై యుద్ధాలకు కాలుదువ్వుతోంది. మన మోదీ ప్రభుత్వం అమెరికాకు సాగిలాపడి పరాధీనంగా మార్చేసి, గ్యాస్, చమురు కష్టాలకు కారణమైంది. ఈ నేపథ్యంలో అమెరికా సామ్రాజ్యవాదాన్ని, ఇరాన్‌పై అమె రికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, భారతదేశంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాల కారణంగా పెరిగిన గ్యాస్ ధరలను వ్యతిరేకిం చాలని సిపిఐ (ఎమ్ ఎల్) రెడ్ స్టార్ పార్టీ పిలుపునిస్తోంది. ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని యుద్ధాన్ని ఆపాలని, ప్రపంచ శాంతిని పరిరక్షించాలని, భారత స్వతంత్ర విదేశాంగవిధానాన్నిపునరుద్ధరించాలనిచాటాలనివిజ్ఞప్తి చేస్తున్నాము.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి






సూర్యాపేట బ్యూరో మార్చి 25 వార్త నిర్భయం

విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రం రవి మహల్ ఫంక్షన్ హాల్ లో స్పందన డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సందర్భంగా వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజంగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు, పౌరులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని తెలిపారు.యువత జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి కష్టపడి చదవాలని, తల్లిదండ్రులు గురువుల మాటలు వింటూ వారి బాటలో పయనిస్తూ తమ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు.డ్రగ్స్ మత్తులో యువశక్తి నిర్వీర్యం అవుతంది అన్నారు.ప్రతి స్కూల్, కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతా, ఏటిఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలియజేయవద్దన్నారు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని కోరారు. సైబర్ మోసాలపై 1930టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపుల పై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపినారు. ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే సూర్యాపేట షీ టీం కి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థినిలు అందరూ క్రమశిక్షణ కలిగి, తల్లిదండ్రులను గురువులను గౌరవించి, ఉన్నత విద్యను అభ్యసించి మీ యొక్క లక్ష్యాలను చేరుకోవాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ సైదారావు, చైర్మన్ వాసుదేవరావు, శర్మ, వేణు, వివిధ కాలేజీల కరస్పాండెంట్స్ వెంకటరెడ్డి, మాధవరెడ్డి, సత్యంబాబు, భగవాన్ రెడ్డి, బాలగౌడ్, సోమిరెడ్డి, లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పరశురాం, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రతాపరుద్ర దేవుడి జయంతి వేడుకలు

వరంగల్. ప్రతినిధి మర్చి 25 (వార్త నిర్భయం) హనుమకొండ జిల్లాలోని చారిత్రక కట్టడం అయిన రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయ ప్రాంగణంలో కాకతీయ సామ్రాజ్య మహారాజు ప్రతాపరుద్ర దేవుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువ నాయకుడు దేవర విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, యువతీ యువకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, అనంతరం ప్రతాపరుద్రుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన వీరత్వం, పరాక్రమం, పరిపాలనా దక్షతను స్మరించుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు. కాకతీయుల సువర్ణ యుగాన్ని గుర్తుచేసు కుంటూ, ప్రతాపరుద్రుడి చరిత్ర ప్రతి తెలుగు వాడికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు శ్రీ విష్ణురెడ్డి , ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, ఎంతో ఘనకీర్తి పొందిన ప్రతాపరుద్రుడి చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చి రానున్న తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఈ




జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి డివిజన్‌లో ఇటువంటి ఉత్సవాలు నిర్వహించి ప్రజలకు తమ వారసత్వ సంపదపై అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాకతీయులు గొలుసుకట్టు చెరువులు నిర్మించి శతాబ్దాల క్రితమే రైతులకు సాగునీరు, త్రాగునీరు అందేలా అనేక జలాశయాలు నిర్మించారని తెలిపారు. ఆధ్యాత్మికత కోసం దేవాలయాలను నిర్మించి ప్రజలు ప్రశాంతంగా జీవించే విధంగా సమాజాన్ని



తీర్చిదిద్దారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది యువతీ యువకులకు కాకతీయ చరిత్రపై అవగాహన కల్పించారు. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్ధి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోటా వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, సురేందర్, రజవలి, జక్కుల రవీందర్ యాదవ్, తాడిశెట్టి విద్యాసాగర్, తోట పవన్, కుమార్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, సోమయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ కార్మికుల ప్రాణాలతో చెలగాటమా

**విధి నిర్వహణలో ప్రమాదం,లైన్ మెన్‌కు తీవ్ర గాయాలు**

**ముస్సిపల్ కార్మికుల కోసం ప్రత్యేక ప్రమాద ఆర్థిక నిధిని ప్రకటించాలి**

**కరీంనగర్ మాజీ మేయర్,రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్ధార్ రవీందర్ సింగ్ డిమాండ్**

కరీంనగర్,మార్చి 25:(వార్త నిర్భయం) విధి నిర్వహణలో భాగంగా మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన మున్సిపల్ విద్యుత్ లైన్ మెన్ శివకృష్ణను కరీంనగర్ మాజీ మేయర్,రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్,58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ పరామర్శించారు. జిల్లాలోని బొమ్మకల్ ప్రాంతానికి చెందిన శివకృష్ణ అల్గునూరు ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగని శ్రీనివాస్ తో కలిసి సర్దార్ రవీందర్ సింగ్ సురక్ష ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. లైన్ మెన్ శివకృష్ణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అతనికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని,అయితే వారికి సరైన రక్షణ పరికరాలు, భద్రతా ప్రమాణాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది లైన్ మెన్‌లు ఇన్సూరెన్స్ సౌకర్యం లేకుండా పనిచేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మున్సిపల్ కార్మికుల ప్రాణాలకు విలువ లేదా? రోజూ ప్రాణాల మీదకు తెచ్చుకుని పనిచేస్తున్న లైన్ మెన్‌లకు కనీస భద్రతా పరికరాలు కూడా అందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యం అని విమర్శించారు. మున్సిపల్ కార్మికులందరికీ తక్షణమే నాణ్యమైన భద్రతా పరికరాలు (సేఫ్టీ కిట్లు,గ్లవ్స్, హెల్మెట్లు) అందించాలని,ప్రతి కార్మి కుడికి సమగ్ర ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని సర్ధార్ రవీందర్ సింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని



కూడా ఆయన కోరారు. పేద కుటుంబాలకు చెందిన ఈ కార్మికులు ప్రమాదాలకు గురైతే వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గాయపడిన శివకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తానని సర్దార్ రవీందర్ సింగ్ హామీ ఇచ్చారు.

# మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

**మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఎలక్ట్రిషన్ ఆకుల వెంకటేష్ ను దుర్భాష లాడాడని ఆరోపణ**

**బయటికి వెళ్ళమని చెప్పాను తప్ప వేరే పదజాలంతో మా ట్లాడ లేదు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి వివరణ**

జడ్చర్ల మార్చి 25 వార్త నిర్భయం

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలో బుధవారం మున్సిపల్ కార్మికులు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రిషన్ గా విధులు నిర్వహిస్తున్న ఆకుల వెంకటేష్ ను మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ లక్ష్మారెడ్డి తో పాటు ఏఈ గాయత్రి చైర్మన్ కోనేటి పుష్పలత పట్టణంలోని విధి దీపాలు ఏర్పాటుపై ఎలక్ట్రిషన్ విభాగం కార్మికులతోని సమావేశం నిర్వహించినట్లు మున్సిపల్ ఎలక్ట్రిషన్ ఆకుల వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆకుల వెంకటేష్ తమ కార్మికులకు కొన్ని ఇబ్బందులు ఉన్నావని కొన్ని నిధులు విడుదల చేయాలని కాంట్రాక్టర్ కు చెప్పాలని తాము కోరామని తెలిపారు. విధులు నిర్వహించడం పట్ల కొన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తన గోడును అధికారుల ముందు ఉంచాడు. ఈ నేపథ్యంలో కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్



లక్ష్మారెడ్డి బయటికి వెళ్లాలని సూచించినట్లు పేర్కొన్నారు. కొంత కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి బయటికి వెళ్ళు పని చేయడానికి వచ్చావా లేదా అని ప్రశ్నించారని దుర్భాషలాడారని ఆకుల వెంకటేష్ ఆరోపించాడు. పనిచేయక పోతే విధులనుండి తొలగిస్తానని కమిషనర్ లక్ష్మారెడ్డి చేప్పారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్మికులతో కలిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆకుల వెంకటేష్ దుర్భాషలాడినట్లు కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు.

**మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా**

జడ్చర్ల పట్టణంలో ఎలక్ట్రికల్ కు వర్క్ కు సంబంధించిన పనులు జరుగుతున్నావని ఈ నేపథ్యంలో ఎలక్ట్రికల్ కు



సంబంధించిన మెటీరియల్ కు టెండర్లు ద్వారా కాంట్రాక్టర్ లు మెటీరియల్ ఇస్తున్నారని. ఎలక్ట్రిషన్ వర్క్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని అదేవిధంగా మున్సిపల్ కార్మికులను ఎలక్ట్రికల్ వర్క్ సంబంధించి పనులు చేయాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తాము ఆ పని చేయము ఈ పని చేయము అని మందలించారని అందుకే బయటకు వెళ్లాల్సిం దిగా సూచించినట్లు మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి అన్నారు. దుర్భాషలాడారు అని ప్రశ్నించగా ఎలాంటి దుర్భాషలాడలేదని అన్నారు. ఇతర మున్సిపాలిటీలో కూడా ఎలక్ట్రికల్ వర్కులు సంబంధించి బ్యాచులుగా ఏర్పడి పనులు చేస్తున్నారని జడ్చర్ల మున్సిపాలిటీలో విడ్డూరంగా మేము అది చేయమని ఇది చేయము అని అనడం సరైన విధానం కాదని అధికారి చెప్పినప్పుడు విధులు తప్పకుండా నిర్వహించాల్సి వస్తుందని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆయన పేర్కొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక డబిల్‌పూర్ ఉర్స్

– గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

సంగారెడ్డి జిల్లా బ్యూరో మార్చ్ 26 (వార్త నిర్భయం )

మత సామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వానికి డబిల్‌పూర్ దర్గా ఉర్స్ ఉత్సవాలు నిలువెత్తు నిదర్శనమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డబిల్‌పూర్ మున్సిపల్ పరిధిలోని హజ్రత్ షా మొహమ్మద్ సబీల్ ఉల్లా చిష్తీ ఉల్ ఖాద్రీ అల్ మెహబూబ్ దర్గా 32వ ఉర్స్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లతో కలిసి చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ దర్గాను సందర్శించారు. గంధం, పుష్ప చాదర్ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. కులమతాలకు అతీతంగా ఇలాంటి ఉత్సవాలు సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం దర్గా కమిటీ చేసిన ఏర్పాట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు వార్డు కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, మేడిపల్లి మురళి, బెంబడి సంజీవరెడ్డి, ఆర్ల కిషన్, నాయకులు సా రెడ్డి గారి



వెంకట్రాంరెడ్డి, షేక్ హుస్సేన్, మద్ది శేఖర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, దాసరి ఆంజనేయులు యాదవ్, అమ్మగారి ప్రవీణ్ రెడ్డి, ఫయాజ్, సీకేజీ యువసేన సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

# జడ్చర్ల తహసిల్దార్ నర్సింగ్ రావుకు వినతి పత్రం అందజేత

జడ్చర్ల మార్చి 25 వార్త నిర్భయం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగస్తుల అసోసియేషన్ అఖిలపక్ష పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తమ సమస్యలు కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి వెలిడేషన్ చట్టం 25 మార్చ్ 2025 ఆపివేయడానికి ఉపసంహరించడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ నీ విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. పెన్షనర్లు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జడ్చర్ల ఎమ్మార్వో నర్సింగ్ రావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో స్పందిస్తూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు నయుముద్దీన్, కార్యదర్శి బుచ్చిరెడ్డి,శంకర్ బాబు, విశ్వనాథం, ఆశీర్వాదం ,జమీల వేబేగం, సత్యనారాయణ, ఉమాదేవి, మైకెల్, మనోహర్, జెస్సి ఫిలిం, ఇమాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు



# సురక్షిత ప్రయాణం ఆటో డ్రైవర్ల బాధ్యత: వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ ప్రతినిధి మార్చి 25 ( వార్త నిర్భయం) ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ఆటో డ్రైవర్ల ప్రధాన బాధ్యత అని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" (ూతీతీఱఙవ ూశ్రీఱఙవ) కార్యక్రమంలో భాగంగా, నేడు కాజీపేట రైల్వే ఆడిటోరియంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ వరకు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. డ్రైవర్లు అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వీడాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మితిమీరిన ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, ప్రశాంత్ రెడ్డి మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఏదుల రిజర్వాయర్ మునక బాధితుల పక్షాన పోరాటం.

## సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్.



వనపర్తి బ్యూరో మార్చి 25 (వార్త నిర్భయం)

రేపల్లి మండలం ఏదుల రిజర్వాయర్లో భూములు ఇండ్లు ప్లాట్లు కోల్పోయిన వారి పక్షాన పోరాడుతామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అన్నారు. కొంకలపల్లి బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభికి వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల రిజర్వాయర్లో కొంకలపల్లి, బండరాయిపాకుల గ్రామాల ప్రజలు భూములు ఇండ్లు ప్లాట్లు కోల్పోయారన్నారు. కొంకలపల్లి లో 47 మంది ప్లాట్లను కోల్పోయారని నష్టపరిహారంగా రూ. రెండు కోట్ల 64 లక్షలు ప్రభుత్వం పరిహారంగా చెల్లించాల్సి ఉన్న ఇంతవరకు చెల్లించలేదన్నారు. పరిహారం కోసం ఆఫీసులో చుట్టూ తిరుగుతూ వేదనను అనుభవిస్తున్నారు. వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నుండి వివాహం కాని వారికి రూట. ఐదు లక్షలు, 250 గజాల ఇండ్ల స్థలం, 18 ఏళ్లు నుండి పెళ్లయిన వారికి రూ. 12 లక్షల 50 వేలు, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాల్సి ఉన్న చాలామందికి ఇవ్వలేదన్నారు. వెంటనే అందరికీ నష్టపరిహారం చెల్లించాలని, పునర్వాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నేతలు వంశీ, నిర్వాసితులు తిరుపతయ్య, బాలరాజు, దేవేంద్రం, తులసి, కురుమూర్తి, మంతయ్య, బాలమణి, శివలీల, కొంకల లక్ష్మయ్య, మిరిగిల్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పి.ఆర్.సిని ప్రకటించి అమలు చేయాలి.

**జిపిఎఫ్, ఆరోగ్య బీమా,మెడికల్ బిల్లులను సంవత్సరాలుగా ఆపడం సరికాదు.**

**ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించండి..**

**ఎస్.టి.యు.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హనుమంత రెడ్డి.**



నాగర్ కర్నూల్ బ్యూరో (మార్చి 25 వార్త నిర్భయం) అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్జునయ్య పదవి విరమణ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్.టి.యు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ మురళి,కొత్త శ్రీధర్ రావులతో కలిసి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వడ్డే హనుమంత రెడ్డి మాట్లాడినారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించవలసిన జిపిఎఫ్, ఆరోగ్య బీమా,మెడికల్ బిల్లులను సంవత్సరాలుగా ఆపడం ప్రభుత్వానికి మంచిది కాదని వెంటనే చెల్లించి వారిని ఆదుకోవాలని అన్నారు. రెండవ పి.ఆర్.సిని ప్రకటించి అమలు చేయాలని, పర్యవేక్షక పోస్టులైన ఎంఈఓ,డిప్యూటీ డీఈవో,డైట్ లెక్చరర్ ఖాళీలను భర్తీ చేయాలని వారు అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో అచ్చంపేట మండల అధ్యక్ష కార్యదర్శులు నారాయణ గౌడ్,భాస్కర్, వివిధ మండలాల నాయకులు చంద్రశేఖర్, విష్ణు,నరేందర్ రెడ్డి, ప్రవీణ్,శ్రీకాంత్, రాజు, కృష్ణయ్య,శ్రీనివాస్, ఈశ్వర్,బ్రహ్మేంద్ర యాదవ్,సృజన,కవిత, మధుసూదన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు పోకల సతీష్,రవి శేఖర్,కొంగరీ రమేష్ ప్రభాకర్,ఏం. సుదర్శన్,విద్యాసాగర్ సత్యనారాయణ, కాశన్న తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి

## పూజ చేసిన మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత



జడ్చర్ల మార్చి 25 వార్త నిర్భయం

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 14 వ వార్డులో మంగళవారం దోనూరు సంయుక్తకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని వినియోగించుకోవాలని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మమ్మ,స్వప్న,పద్మ పాల్గొన్నారు